సాక్షి సిద్దిపేట

శనివారం । 4 । జనవరి । 2025



ప్రజల భద్రతకు పెద్దపీట

ప్రజల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. – వివరాలు 10లో ▸



బీసీ డిక్లరేషన్‌ను..

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. వివరాలు 10లో ▸

పరీక్షల ఫీజు షెడ్యూల్..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజు షెడ్యూలు విడుదలైంది. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 22 వరకు, రూ.25 రుసుంతో ఈ నెల 29 వరకు, రూ.50 రుసుంతో ఫిబ్రవరి 3 వరకు పరీక్ష ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

మద్యం అమ్మినా.. తాగినా జరిమానా

- తిమ్మాపూర్ గ్రామస్తుల తీర్మానం



తిమ్మాపూర్‌లో తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మద్యం అమ్మినా, తాగినా జరిమానా విధిస్తామని మండలంలోని తిమ్మాపూర్ గ్రామస్తులు శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో విచ్చలవిడిగా మద్యం అమ్మడం వల్ల ఎంతో మంది మద్యానికి బనిసై తమ విలువైన జీవితాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించిన తర్వాత కుటుంబాల్లో గొడవలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో మద్యం అమ్మితే రూ.5 లక్షలు, కొన్న వారికి రూ.10 వేల జరిమానా విధిస్తామని తెలిపారు. గ్రామంలో ఎవరైనా దొంగచాటుగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందించిన వారికి రూ. 5 వేల ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. అనంతరం తీర్మాన పత్రాన్ని ఎస్ఐకి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

దుబ్బాకటౌన్: పౌష్టికాహారంతోనే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి అన్నారు. అలాగే విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించాలన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మూడు వందలకు పైగా వంటకాలను వారి తల్లిదండ్రుల సహాయంతో తయారు చేసి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి సహకరించిన ఎన్నారై దంపతులకు, ఇతర దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి, నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తదితరులున్నారు.

నేడు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను శనివారం ఉదయం 9గంటలకు టీటీసీ భవన్‌లో నిర్వహించనున్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విజ్ఞాన్ ప్రతిష్ఠాన్, జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం అధ్యక్షుడు మామిడి పూర్ణచందర్ రావు, ప్రధాన కార్యదర్శి గుండా వేణుమాధవ్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు జిల్లా స్థాయిలో పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణిస్తే ఈ నెల 25న హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనను న్నట్లు పేర్కొన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి

ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిద్దిపేటరూరల్: గురుకుల, సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర కోకన్వీనర్ పవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు జైళ్లకంటే అధ్వానంగా మారాయన్నారు. 12 నెలలుగా 50 మంది విద్యార్థులు వసతి గృహాల్లో చనిపోయారని, సుమారు 3వేల మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్ బారిన పడ్డారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యుడు వివేక్, జిల్లా కన్వీనర్ ఆదిత్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మూడు గదులు.. ఏడు తరగతులు



బెక్కల్ గ్రామంలో ఒకే గదిలో రెండు తరగతులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో తరగతులకు అనుగుణంగా గదులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూళ్మిట్ట మండలం బెక్కల్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మూడు గదుల్లో ఏడు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 96 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్క నాలుగో తరగతికి మాత్రమే ఒక గది ఉంది. మూడు, ఐదు తరగతులు ఒక గదిలో, ఆరు, ఏడు తరగతులు మరో గదిలో, ఒకటి, రెండు తరగతులు ఇంకో గదిలో నిర్వహిస్తున్నారు. మొత్తం తొమ్మిది మంది ఉపాధ్యాయులకు గాను నలుగురు మాత్రమే ఉన్నారు. పాఠశాలకు ప్రహరీ సైతం లేదు.

– మద్దూరు(హుస్నాబాద్)

కరెంట్ కష్టాలకు చెక్



విద్యుత్ అంతరాయం ఏర్పడితే క్షణాల్లో ఆ ప్రాంతానికి చేరుకుని మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించనున్నారు. అందుకోసం టీజీఎస్‌పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912 ఏర్పాటు చేసింది. అంబులెన్స్ తరహాలో వాహనాన్ని జిల్లాకు కేటాయించారు. విద్యుత్ శాఖలో బ్రేక్‌డౌన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్లను, గాలి, వానలకు చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడి అంతరాయం ఏర్పడితే త్వరగా స్పందించి సమస్యను పరిష్కరించనున్నారు.

సత్వరం విద్యుత్ సమస్యల పరిష్కారం

- 108 తరహాలో టోల్‌ఫ్రీ నంబర్ 1912..
- తక్షణమే స్పందించేందుకు ప్రత్యేక వాహనం
- మరమ్మతుల కోసం చెంతనే సామగ్రి



ప్రత్యేక వాహనం ఇదే..

సాక్షి, సిద్దిపేట: వానాకాలంలో, ఎండాకాలంలో సాధారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమస్యలే ఎక్కువగా ఉంటాయి. అప్పుడప్పుడు ఆయా అధికారులు ఫోన్లు లిఫ్ట్ చేయకపోతే కార్యాలయాలకు వెళ్లి చెప్పాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు సుమారు గంటకుపైగానే పడుతుంది. ఇప్పుడు అలా కాదు.. విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే టోల్ ఫ్రీ 1912 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య చెప్పవచ్చు. ఆ సమస్యను స్థానిక విద్యుత్ అధికారులకు సమాచారం అందించనున్నారు. అనంతరం ఫిర్యాదుదారుడికి మెసేజ్ సైతం పంపిస్తుంది. వారు వెంటనే వెళ్లేందుకు ప్రత్యేక వాహనాన్ని విద్యుత్ శాఖ మంజూరు చేసింది. ప్రత్యేక వాహనంలో కరెంట్ వైర్లు, థర్మోవిజన్ కెమెరాలు, ఫ్యూజులు, తాళ్లు, కండక్టర్లు, పవర్ రంపం మిషిన్, పొడవాటి నిచ్చెన వంటివి అందుబాటులో ఉండనున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అయితే వెంటనే మార్చడానికి మరో ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్లడానికి వాహనం రెడీగా ఉంటుంది. వాహనంలో లైన్‌మెన్, ఇద్దరు జూనియర్ లైన్‌మెన్లు అత్యవసరంలో టీం స్పందించి సమస్యను పరిష్కరించనుంది.

త్వరలో అందుబాటులోకి..

సిద్దిపేట టౌన్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నాం. విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే త్వరగా వెళ్లి పరిష్కరించేందుకు ప్రత్యేక వాహనం కేటాయించారు. దీనికి లోకల్ సిబ్బందిని కేటాయించనున్నాం. త్వరలో ప్రత్యేక వాహనం అందుబాటులోకి రానుంది.

– సుధాకర్ రెడ్డి, ఏడీఈ

తొలుత సిద్దిపేట టౌన్‌లో..

విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనం తొలి విడతలో సిద్దిపేట టౌన్‌కు కేటాయించారు. ఈ వాహనాన్ని అధికారికంగా ప్రారంభించేందుకు విద్యుత్ శాఖ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5.5లక్షల విద్యుత్ సర్వీస్‌లున్నాయి. జిల్లాలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లు 180 ఉన్నాయి. త్వరలో గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల పట్టణాలకు కేటాయించన్నారు.

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వాన్‌కుమార్

సిద్దిపేటకమాన్: వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వాన్‌కుమార్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో వ్యాక్సిన్ స్టోర్‌ను డీఎంహెచ్‌ఓ శుక్రవారం ప్రారంభించారు. చిన్న పిల్లలకు, గర్భిణులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల పంపిణీ వంద శాతం సక్రమంగా నిర్వహించాలన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. టీకాల కొరత లేకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పెన్షన్ల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్

చేర్యాల(సిద్దిపేట): వృద్ధుల పెన్షన్లపై అధికారులు స్పందించారు. వృద్ధులకు సకాలంలో పెన్షన్ అందక ఇబ్బంది పడుతున్నారంటూ శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన ఏడి'పింఛన్' అనే కథనానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. గుర్జకుంట గ్రామానికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది



సిద్దిపేట పట్టణంలో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానికులు

హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ

- వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలి
- సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏసీపీ మధు తెలిపారు. జిల్లా కేంద్రంలో పోలీస్ అధికారులు హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిచారు. బస్టాండ్ చౌరస్తాలో హెల్మెట్ ధరించకుండానే వాహనాలను నడుపుతున్న వారికి పోలీసులు గులాబీలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: వాహనదారుడికి పూలదండ వేసి హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హెల్మెట్ ధరిస్తేనే రక్షణ

గజ్వేల్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. హెల్మెంట్ లేకుండా వెళ్తున్న వాహనదారులను ఆపి...పూల దండలు వేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ట్రాఫిక్ సీఐ మురళీ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు.

సమాజ మార్పునకు పూలే శ్రీకారం

- సావిత్రిబాయి స్ఫూర్తితో ముందుకు సాగాలి
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

సిద్దిపేటరూరల్: సమాజ మార్పునకు సావిత్రిబాయి పూలే శ్రీకారం చుట్టారని, అందరూ ఆమె స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని నిర్మించిన ప్రేమస్వరూపిణి సావిత్రిబాయి పూలే అన్నారు. పూలే జయంతిని ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిందన్నారు.

కలెక్టర్‌కు న్యూఇయర్ శుభాకాంక్షలు..

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా అధికారులు శుక్రవారం కలెక్టర్ మనుచౌదరిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పోలీస్ కమిషనర్ అనురాధ, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్,డీఆర్‌ఓ నాగరాజమ్మ, ఆర్డీఓలు, జిల్లా, ఔట్‌సోర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ అనురాధ

కృత్రిమ మేధతో అనేక ఉపయోగాలు



పరిశోధనా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, వక్తలు

- ఏఐపై పట్టు సాధించాలి
- జాతీయ సదస్సులో వక్తలు

సిద్దిపేటఎడ్యుకేషన్:కృత్రిమ మేధస్సు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అన్ని రంగాల్లో వేగంగా దూసుకుపోతోందని, ఏఐతో అనేక ఉపయోగాలు ఉన్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఏఐపై రెండ్రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కరీంనగర్ లైఫ్‌లైన్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్ కుమార్, సదస్సు అధ్యక్షురాలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, ముఖ్యవక్తలు ప్రొఫెసర్ శరత్‌బాబు, తమిళనాడు ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణచందర్ తదితరులు హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుందని విద్యా, పరిశోధనా రంగాల్లో సైతం అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. క్యాన్సర్ నివారణలో సైతం ఏఐని ఉపయోగించుకోవచ్చన్నారు. పరిశోధకులు ఏఐపై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థులు ఏఐని అందిపుచ్చుకుని భవిష్యత్‌లో రాణించాలన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అతిథులను పరిచయం చేయగా, కార్యదర్శి డాక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి 200లకు పైగా పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. అనంతరం పరిశోధనా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సమాజంలో అందరికీ జీవించే హక్కు

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి



మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమాజంలో అందరికీ జీవించే హక్కు ఉందని ఆర్టికల్ 21 తెలియజేస్తోందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ముందుగా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు అనేక ప్రాథమిక హక్కులు న్నాయన్నారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. న్యాయ సలహాలు, సూచనల కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాము, సీఐ పాల్గొన్నారు.

స్థానిక సమరంపై పొన్నం నజర్

- గెలుపే లక్ష్యంగా ప్రత్యేక వ్యూహం
- మండలాల వారీగా సమావేశాలు



అక్కన్నపేటలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: స్థానిక ఎన్నికలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించారు. గెలుపే లక్ష్యంగా ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. దశాబ్ద కాలంగా ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ప్రత్యర్థుల కంటే ముందే రంగంలోకి దిగి పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని స్థానిక ఎన్నికల్లో పునరావృతం చేయాలని కార్యకర్తల్లో జోష్ తీసుకువస్తున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మూడు రోజులుగా మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే మంత్రి కార్యాచరణను ప్రకటించారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు, హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, అక్కన్నపేట మండలాల్లో ముఖ్య నేతలు, కార్యకర్తలతో భేటీ అయి నూతన ఉత్తేజాన్ని నింపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని చెబుతున్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి..

సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే వారు సిద్ధం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్ పోటీ చేసి విజయం సాధించారు. వెనువెంటనే జరిగిన కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బీజేపీ కంటే అధికంగా మేజారిటీ లభించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల సమరంపై నజర్ పెట్టారు. దశాబ్ద కాలం తర్వాత స్థానిక సంస్థల పదవులపై కాంగ్రెస్ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కష్టపడ్డవారికే పదవులు దక్కుతాయని, నేతలు, కార్యకర్తలు సమష్టిగా పని చేస్తూ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని మంత్రి కోరారు.

స్థానిక ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం..

హుస్నాబాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా పొన్నం ప్రభాకర్‌కు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. హుస్నాబాద్‌కు మొదటి సారిగా మంత్రి పదవి వరించడంతో పదవులు కలిసి వస్తాయని కాంగ్రెస్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి...

మంత్రి నియోజకవర్గంలో ఒకే ఒక మున్సిపాలిటీ హుస్నాబాద్. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా, మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. ప్రస్తుత మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను ముగ్గురు ఇండిపెండెంట్లు, ఒకరు బీజేపీతో కలిపి బీఆర్‌ఎస్‌కు 13 మంది కౌన్సిలర్ల బలం ఉండగా, కాంగ్రెస్‌కు ఆరుగురు ఉన్నారు. ఈ నెల 26కు పాలకవర్గం గడువు ముగుస్తుంది. ఈలోపే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 5న పలు వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలు, కమ్యూనిటి భవనాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ సారి ఎలాగైనా మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అందుకు తగ్గట్లుగా మంత్రి కసరత్తు చేస్తున్నారు.

నేతలంతా సమన్వయంతో పనిచేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు నేతలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అక్కన్న పేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఊరూరా కాంగ్రెస్ జెండా ఎగిరేలా నేతలంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టు కింద ఉన్న కాలువల నిర్మాణ పనులు పూర్తి చేసి సాగునీరు అందజేస్తానన్నారు. ఈ మొట్టప్రాంతాన్ని సస్యశామ్యలం చేయాలన్నదే లక్ష్యమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారంతా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలపై దృష్టిసారించాలన్నారు. జిల్లా గంధ్రాల య చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కథల పోటీలు

ఫిబ్రవరి 25 చివరి గడువు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాలల్లో సాహిత్య అభిరుచి పెంపొందించి, తద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో ఉగాది బాలల కథల పోటీ- 2025కి విద్యార్థుల కథలను ఆహ్వానిస్తున్నట్లు సుగుణ సాహితీ సమితి కన్వీనర్ బైతి దుర్గయ్య శుక్రవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కథలను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.1,500, రెండు ద్వితీయ బహుమతులు రూ.1,000 చొప్పున, మూడు తృతీయ బహుమతులు రూ.500 చొప్పున, రూ.300 చొప్పున 12 ప్రత్యేక బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. బహుమతులను ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్పడగ చెన్నకష్టారెడ్డి అందించనున్నట్లు పేర్కొన్నారు. హామీ పత్రంతో పాటు విద్యార్థులు తాము రాసిన కథలను ఫిబ్రవరి 25 లోగా జిల్లా కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో అందించాలన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ



పంట పొలంలో బోల్తాపడిన లారీ

తొగుట(దుబ్బాక): లారీ బోల్తా పడిన ఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేట శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ గురువారం తెల్లవారు జామున గ్రామ శివారులో పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. డ్రైవర్ అజాగ్రత్త అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

సైబర్ వలలో ఐటీ ఉద్యోగి

రూ.5 లక్షలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: షేర్ల పేరుతో ఐటీ ఉద్యోగి నుంచి సైబర్ నేరస్తులు డబ్బులు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైమ్ సీఐ రాజు కథనం మేరకు.. పటాన్ చెరు గౌతం నగర్ కాలనీకి చెందిన ఓ ఐటీ ఉద్యోగికి డిసెంబర్ 19వ తేదీని సైబర్ నేరస్తులు ఫోన్ చేసి, ఇనిస్ట్యూషనల్ అకౌంట్ ట్రేడింగ్ లో షేర్లు కొనుగోలు చేస్తే లాభాలు వస్తాయని చెప్పి నమ్మించారు. దీంతో బాధితుడు పలు దఫాలుగా రూ.5 లక్షలు వారి ఖాతాలో జమ చేశాడు. అనంతరం సైబర్ నేరస్తులు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



అక్షయను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దుబ్బాక: జాతీయస్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలకు దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థిని కర్నాల అక్షయ ఎంపికైంది. డిసెంబర్‌లో నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. విద్యార్థిని జనవరి 6 నుంచి విజయవాడలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా అక్షయను ఘనంగా సన్మానించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాసు, హెచ్ఎంలు సాదత్‌అలీ, నాగభూషణం, సంజీవయ్య, జానకీరామ్, నాగరాజు, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపార రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సలహాలకు సంప్రదించండి : 7297898678. [T-293]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 [SCA25001023]

WANTED

■ హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA25001049]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తపాలా.. వసతుల్లో దివాలా

అద్దె భవనాల్లో పోస్టాఫీసులు
- అరకొర వసతుల నడుమ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- సొంత భవనాలు లేక రూ.లక్షల్లో కిరాయి చెల్లింపు
- వినియోగదారులకు తప్పని ఇక్కట్లు
- మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని కార్యాలయాల్లో అధ్వాన పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి :	
ప్రధాన తపాలా కార్యాలయాలు :	2
ఉప కార్యాలయాలు :	40
శాఖ కార్యాలయాలు :	243
సొంత భవనాలు :	5
అద్దె భవనాల్లో:	280



తూప్రాన్‌లో ఇరుకు గదుల్లో కొనసాగుతున్న తపాలా కార్యాలయం



చేగుంటలో అద్దె గదిలో కార్యాలయం

తూప్రాన్: అరకొర వసతులు.. అద్దె భవనాలతో తపాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మెదక్, సిద్దిపేట జిల్లాలోని ఉప తపాల కార్యాలయాలకు నేటికీ సొంత భవనాలు లేవు. దీంతో తపాలా సేవలు వినియోగించుకునేందుకు వచ్చే వారికి ఇక్కట్లు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లోనైతే నివాస గృహాల్లోనే కొనసాగిస్తుండడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఖాతాదారులకు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేని పరిస్థితి. అద్దె భవనాలు కార్యాలయ నిర్వహణకు కేంద్రం చెల్లించే నగదు సరిపోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

మెదక్, సిద్దిపేట ప్రధాన తపాలా కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. అలాగే దుబ్బాక, రామాయంపేట, మక్కారాజ్‌పేటలో మాత్రమే సొంత భవనాల్లో తపాలా కార్యాలయాలు కొనసాగుతున్నాయి. మిగితా ప్రాంతాల్లో అద్దె భవనాలు, నిరూపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. 163 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న తపాల శాఖ ప్రజల మన్ననలు పొందుతూ ఎన్నో కొత్త సేవలకు శ్రీకారం చుడుతుంది. అంతా బాగున్నా కార్యాలయాలకు సొంత భవనాలను సమకూర్చే ఆలోచన చేయక రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తుంది.

ఎన్నో రకాల సేవలు అందుబాటులో..

గ్రామీణ తపాలా బీమా, రికవరీ, పొదుపు ఖాతాలు, పరిమిత కాల డిపాజిట్లు, రైతుబంధు, జాతీయ పొదుపు పత్రాలు, ఆధార్ అనుసంధానం, ఆధార్ సహిత చెల్లింపులు, కిసాన్ వికాస్ పత్రాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఇలా ఎన్నో సేవలు అందిస్తున్న ఉప తపాల కార్యాలయాల్లో సరైన వసతులు లేవు. గదులు ఇరుకుగా ఉండటంతో సేవలు పొందేందుకు వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో సేవల్లో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా మహిళా ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్‌లో చేర్పులు, మార్పులు, నమోదు కోసం నిత్యం ప్రజలతో కిక్కిరిసిపోతున్నాయి. కానీ సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు.

రక్షణ కరువు

చాలా ఉప తపాల కార్యాలయాలకు ప్రహరీలు లేవు. కాపలాదారులు లేరు. కార్యాలయాల్లో విలువైన బీమా పత్రాలు, నగదు చెల్లింపులు, పింఛన్ డబ్బులు, ప్రభుత్వ పథకాల డబ్బులు, సాంకేతిక పరికరాలు, జనరేటర్లు, కంప్యూటర్లు ఉంటాయి. అద్దె భవనాల్లో కొనసాగడంతో విలువైన సామగ్రి పత్రాలు, డబ్బులకు రక్షణ కరువైంది. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలో గజ్వేల్, తూప్రాన్, అక్కన్నపేట, చేగుంటలో సొంత భవనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు తపాలా శాఖకు చెందిన ఓ ఉద్యోగి తెలిపారు. సొంత భవనాల్లో కార్యాలయాలు ఏర్పాటు అయితే ప్రజలకు నాణ్యమైన సేవలు అందనున్నాయి.

స్థలం కబ్జా

తూప్రాన్ డివిజన్ కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌కు సమీప దూరంలో దశాబ్దాల కిందట తపాలా కార్యాలయం ఏర్పాటు కోసం అధికారులు సుమారు 600 గజాలకు పైగా స్థలం కేటాయించారు. గజానికి సుమారు రూ.లక్ష వరకు మార్కెట్ విలువ కలిగి ఉంది. ప్రస్తుతం కొందరు ఈ స్థలాన్ని కబ్జా చేయగా, మరికొంత సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. నేడు కేవలం 200 గజాలు మాత్రమే మిగిలిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తపాలా శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సొంత భవనం నిర్మించాలని కోరుతున్నారు.



కబ్జాకు గురైన తపాలా కార్యాలయం స్థలం

ఇబ్బందులు పడుతున్నాం



పోస్టాఫీసు ఇరుకైన గల్లీలో ఉంది. ఇక్కడ కనీసం కూర్చుందామన్నా కుర్చీలు అందుబాటులో లేవు. గంటల కొద్ది నిలబడాల్సి వస్తుంది. ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి. అద్దె భవనాలకు బదులు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.

–వసంత, వినియోగదారురాలు

సౌకర్యాలు కల్పించాలి



పోస్టాఫీసులో డబ్బులు జమ చేయాడానికి వస్తే ఇక్కడ సరైన వసతులు లేవు. కనీసం రాయడానికి బల్లాలు లేవు. నేలపై కూర్చోవాల్సి వస్తుంది. ప్రభుత్వం అన్ని చేస్తున్నామని చెబుతుంది కానీ ఎవరూ పట్టించుకోవడంలేదు. అత్యవసరమైతే కనీసం మూత్రశాలలు లేవు. అధికారులు స్పందించి మంచి సౌకర్యాలు చేయాలి.

–సాదీక బేగం, వినియోగదారురాలు

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

గజ్వేల్‌రూరల్: అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఏడాది గడిచినా ఎందుకు అమలు చేయడం లేదని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ప్రశ్నించారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని హైద్రాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత చేపట్టిన బీసీ సదస్సుకు శుక్రవారం గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహించిన అనంతరం తరలివెళ్లారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. కామారెడ్డిలో ప్రకటించిన బీసీల డిక్లరేషన్‌పై కాలయాపన చేయడం తగదన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలను నమ్మించి వారి ఓట్లతో గెలుపొంది, అధికారంలోకి రాగానే బీసీలను విస్మరించిందని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ అమలుకు డిక్లరేషన్ కమిటీ వేసి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. డిక్లరేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలన్నారు. బీసీలకు లక్ష కోట్లతో సమగ్రాభివృద్ధి చేపట్టాలని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లను వర్తింపజేయాలని, ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయని పక్షంలో బీసీల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు పెద్దపీట



పోలీసు అధికారులు, సిబ్బందితో సీపీ అనురాధ

- పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత
- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ప్రజల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంతో కలిసి సీపీ శుక్రవారం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు, ప్రజల సేఫ్టీ, సెక్యూరిటీకి, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. నూతన ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలన్నారు. 2024లో శాంతి భద్రతల విషయంలో మెరుగైన సేవలందించినందుకు సిబ్బందిని అభినందించారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందించాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని, సైబర్ నేరాలు తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తం రెడ్డి, సతీష్, యాదగిరి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్ కిరణ్, శ్రీధర్, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్ట్, ఐదుగురు పరారీలో..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్



గంజాయిని చూపుతున్న ఎస్పీ, తదితరులు

సంగారెడ్డి జోన్: అక్రమంగా రవాణా చేస్తున్న ఎండుగంజాయి పట్టుకున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మహ్మద్ అక్బర్, మహ్మద్ సల్మాన్, ఇస్మాయిల్ అతడి అనుచరులు మహబూబ్, రజాక్ మారుతీ కారులో ఒరిస్సా బార్డర్ నుంచి హైదరాబాద్ మీదుగా ముంబాయికి గంజాయి తరలిస్తున్నారు. వీరికి చెందిన మరో ఇద్దరు నవాజ్, షబ్బీర్ ముందు కారులో వెళ్తూ గంజాయి తీసుకొస్తున్న ఐదుగురికి సిగ్నల్ ఇస్తున్నారు. గంజాయి తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు జహీరాబాద్ శివారులోని పాత ఆర్టీఓ చెక్ పోస్ట్ సమీపంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో పోలీసులు వీరి కారును ఆపగా వాహనాన్ని నిలుపకుండా వెళ్లారు. కొద్దిదూరం వెళ్లాక కారు ఆపి అందులోని ముగ్గురు పరారీ కాగా, ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద సుమారు రూ.30 లక్షలు విలువ చేసే 110 కేజీలు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దొరికిన వారిలో మహ్మద్ అక్బర్, మహ్మద్ సల్మాన్ ఉండగా మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. జహీరాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, జహీరాబాద్ డీఎస్పీ రామ్ మోహన్ రెడ్డి, టీనాబ్ డీఎస్పీ పుష్పన్ కుమార్, జహీరాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివలింగం, ఎస్ఐలు కాశీనాథ్, ప్రసాద్ రావు, సిబ్బంది ఉన్నారు.

కుమారుడు మందలించాడని తల్లి ఆత్మహత్యాయత్నం

పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



గంగమణి (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గురువన్నపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరపు గంగమణి (40)కి ఇద్దరు కుమారులు. గత నెల 24న చిన్న కుమారుడు వివాస్ అల్లరి చేయడంతో తల్లి కొట్టింది. దీంతో పెద్దకుమారు వంశీ తమ్ముడిని ఎందుకు కొడుతున్నావని తల్లిని మందలించాడు. ఈ క్రమంలో క్షణికావేశంలో గంగమణి ఇంట్లో పురుగు మందు తాగింది. గమనించిన స్థానికులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చనిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి..



మహేశ్ (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన ముండ్రాయిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అనంతారం పీటీ మల్లూర్ గ్రామానికి చెందిన పోలెబోయిన మహేశ్ (30) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ బతుకుదెరువు కోసం ముండ్రాయికి వచ్చాడు. మరో ముగ్గురితో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున నిద్రలేచిన తోటి పనివారు మహేశ్ కనబడకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఇంటి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద అతడి చెప్పులు కనబడటంతో అందులో పడినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసీఫ్ అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణం

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి



బాల్‌నర్సయ్య (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి బాల్‌నర్సయ్య(40) పదిహేను ఏళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో ఆటో సరిగా నడవకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ఉరేసుకొని వృద్ధురాలు..



విమల (ఫైల్)

దుబ్బాకటౌన్: ఉరేసుకొని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక పట్టణంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన అబ్బతిని విమల(63) కుమారుడు రాజేశ్, కోడలు, మనవడితో జీవిస్తుంది. కుమారుడు పట్టణంలో వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా విమల తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చూయించినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం కుమారుడు చూసి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించాడు. మృతురాలి కుమారుడు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి వృద్ధురాలు..

తూప్రాన్: చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. బ్రాహ్మణపల్లికి చెందిన అంజమ్మ(62) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చెరువు కట్టపై అంజమ్మ ధరించిన స్వెట్టర్ గమనించిన కుటుంబ సభ్యులు నీళ్లలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యం తాళలేక వ్యక్తి..

సిద్దిపేటరూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పుల్లూరు గ్రామానికి చెందిన రామగల్ల మధు (35) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడేళ్లుగా అనా రోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ బాధను భరించలేక శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సారిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ కొనివ్వలేదని బాలుడి ఆత్మహత్య

- 31న రాత్రి గడ్డి మందు తాగిన బాలుడు
- చికిత్స పొందుతూ శుక్రవారం మృతి

సిద్దిపేటఅర్బన్: తల్లిదండ్రులు బైక్ కొనివ్వడం లేదని మనస్తాపానికి గురైన బాలుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామంలో జరిగింది. టూటౌన్ పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ ఇస్మాయిల్ కుమారుడు రిజ్వాన్ (15) 7వ తరగతి వరకు చదువుతున్నాడు. చదువు మానేసి కొంత కాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. తనకు బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులను ఇటీవల అడగగా తమ ఆర్థిక పరిస్థితి గురించి వివరించి సర్దిచెప్పారు. ఈ క్రమంలో డిసెంబర్ 31న అర్ధరాత్రి మూత్రవిసర్జనకు బయటకు వెళ్లాడు. చాలా సేపటి వరకు ఇంట్లోకి రాకపోవడంతో తల్లిదండ్రులు బయటకు వచ్చి చూడగా గడ్డి మందు తాగినట్టు వారికి చెప్పాడు. దీంతో వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షలతోనే ప్రాణాలు తీయాలనుకున్నాడు

- మద్యంలో విషం కలిపి హత్యాయత్నం
- తాగడంతో ఆస్పత్రిపాలు
- ముగ్గురు నిందితులు అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పాత కక్షలతో మద్యంలో విషం కలిపి ఓ వ్యక్తి ప్రాణాలు తీయాలనుకున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో జరిగిన ఘటనపై శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నీరుగంటి నర్సింలు, గరిదాసు గోపీకి వ్యవసాయ పొలానికి వెళ్లే బాట విషయంలో పంచాయితీ నడుస్తోంది. నర్సింలును చంపితేనే తన వ్యవసాయ పొలానికి బాట సాఫీగా ఉంటుందని గోపీ స్నేహితులతో కలిసి రెండు నెలలుగా పథకం వేశాడు. పథకం ప్రకారం స్నేహితులతో కలసి గత నెల 18న గజ్వేల్‌లో వైన్స్ దుకాణంలో మద్యం తీసుకున్నారు. అందులో గడ్డి నివారణకు వాడే పురుగు మందును కలిపి నీరుగంటి నర్సింలు గుడిసెలో పెట్టారు. అనుమానం రాకుండా పేకాట ముక్కలు, తాగిన గ్లాసులు పెట్టి రాత్రి వెళ్లిపోయారు. 19న గుడిసెలోకి వెళ్లిన నర్సింలు మద్యాన్ని ఎవరో తాగి వదిలి వేశారని అనుకొని తన మామ మెండే కనకయ్య, నీరుగంటి అయిలయ్య, విఘ్నేష్‌లను పిలిచి మద్యాన్ని తాగారు. దీంతో వారు అస్వస్థతకు గురై గజ్వేల్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు మద్యంలో పురుగు మందు కలిసిందని తెలిపారు. ఈ ఘటనపై 26 కనకయ్య కుమారుడు ప్రవీణ్ జగదేవ్‌పూర్‌లో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అనుమానితులైన తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గరిదాసు గోపి, రాచమల్ల స్వామి, కొంతం అయిలయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

రైతుల అనుమానాల్ని నివృత్తి చేయాలి

- రామాయంపేటలో బై పాస్ రోడ్డు నిర్మాణం
- నిర్వాసితులకు పరిహారం అందజేస్తాం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్: రామాయంపేట బైపాస్ రోడ్డు నిర్మాణ విషయంలో రైతుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం అధికారులపై ఉందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్ నుంచి సిద్దిపేట వరకు 69 కిలోమీటర్లు ఎన్‌హెచ్–76 రోడ్డు నిర్మాణం జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇందులో భాగంగా రామాయంపేట బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులతో శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, నేషనల్ హైవే ఈఈ బలరామకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులతో ఎంపీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో 2.65 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కొందరు భూములు కోల్పోతారని ఇందుకు సహకరించాలన్నారు. ఈ విషయంలో ఆర్డీవో, తహసీల్దార్ స్థాయి అధికారి క్షేత్రస్థాయి సర్వే ద్వారా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్వాసితులకు రిజిస్ట్రేషన్ ధరలకు అనుగుణంగా పరిహారం అదే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రోహిత్ రావు మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, డీఈ అన్నయ్య, ఏఈ మురళీకృష్ణ, రామాయంపేట తహసీల్దార్ రజని, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.